సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 10 । మే । 2023



ఆంజనేయస్వామికి పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు.



కోట సత్తెమ్మ జాతర

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరపాలెంలో కోట సత్తెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన వాహనంపై ఊరేగించారు.



క్షీరారామంలో గణపతి హోమం

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా గణపతి హోమం జరిపించారు. హోమంలో 15 మంది దంపతులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్, ఉపముఖ్యమంత్రి కొట్టు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం డివిజన్‌గా ఏర్పాటు చేసి ఆర్‌డీఓ, డీఎస్పీ కార్యాలయాలతోపాటు రవాణా శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అభివృద్ధి చేశారన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి సహకారంతో తాడేపల్లిగూడెం పట్టణానికి జిల్లాస్థాయి కార్యాలయాలను ఏర్పాటు చేసిన ఘనత కొట్టుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వెలనాటి సత్తిబాబు, కొలుకులూరి ధర్మరాజు, బొద్దాని శ్రీనివాసు, కర్నాటి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



మద్ది క్షేత్రంలో మాట్లాడుతున్న ఆలయ ఈఓ

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఈ నెల 13 నుంచి 17 వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఈ నెల 13న మద్ది ఆంజనేయ స్వామి నిజరూప దర్శనం, 14న హనుమజ్జయంతి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, లక్ష తమలపాకులతో పూజ, పంచామృతాలతో అభిషేకాలు, 15న సువర్చలా హనుమద్ కల్యాణం, సాయంత్రం 6 గంటలకు స్వామి గ్రామోత్సవం, 16న ఉపాలయంలో ఉన్న అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, 17న ప్రత్యేక హోమాలు, పుష్కరిణిలో స్వామి వారికి చక్రస్నానం, రాత్రి 7 గంటలకు స్వామి తెప్పోత్సవం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు మల్నీడి బాబి, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

హైవే పనులు తక్షణం పూర్తి చేయాలి



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ శాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న

పాలకొల్లు అర్బన్: జాతీయ రహదారి 165 పామర్రు నుంచి దిగమర్రు నిర్మాణ పనులు తక్షణం పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న అన్నారు. విజయవాడ నుంచి బయలుదేరిన ఆయన మంగళవారం కాకినాడ వరకు పర్యటించి దిగమర్రులో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో సమీక్షించారు. జాతీయ రహదారి 165కి సంబంధించి ఎంత మేర పనులు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది, భూ సేకరణ చేయాల్సిన అవసరం అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఆయన వెంట జాతీయ రహదారి ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ సంజీవరాయుడు, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి ఎస్ లోకేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

నరసాపురం: వేసవి దృష్ట్యా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నరసాపురం-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్(భీమవరం) మధుబాబు చెప్పారు. 07687 సర్వీస్ నెంబర్‌తో ఈ నెల 14, 21, 28 తేదీల్లో నరసాపురం నుంచి మధ్యాహ్నం 3.10 గంటలకు బయలు దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.50 గంటలకు యశ్వత్‌పూర్ చేరుకుంటుందన్నారు. మళ్లీ 15, 22, 29 తేదీల్లో రాత్రి 10.50 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు నరసాపురం చేరుకుంటుందన్నారు. రద్దీని బట్టి మరికొన్ని రోజులు ఈ రైళ్లను పొడిగించే అవకాశం ఉంది.

ఉపాధి కల్పనలో ప్రథమం

- జిల్లాలో రోజుకు 45 వేల మందికి ఉపాధి
- ఏప్రిల్‌లో 6.30 లక్షల పనిదినాలతో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- వేతనాలుగా రూ 15.70 కోట్ల చెల్లింపు



ఉండి మండలం ఉణుదుర్రులో చెరువు తవ్వకం పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉపాధి కూలీలు నూరు శాతం పనిచేస్తున్నారు. రోజుకు రూ.241 చొప్పున ప్రభుత్వం కూలీలకు వేతనం అందిస్తుంది. రబీలో మాసూళ్లు చాలా వరకు యంత్రాలతో చేయడంతో వ్యవసాయ పనులు చేసే కూలీలు ఉపాధి పనులపై ఆధారపడ్డారు. పంట బోదెలు, పంట కాలువల్లో పూడిక తీత పనులు, అమృత సరోవర్ పథకంలో చెరువుల తవ్వకం తదితర పనులు చేస్తున్నారు.

ఏప్రిల్ నెలలో రాష్ట్రంలోనే ప్రథమం

ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఉపాధి పనులు ప్రారంభించారు. ఏప్రిల్‌లో 6.45 లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఇంతవరకు మొత్తం 6.50 లక్షల పనిదినాలు కల్పించగా కూలీలకు రూ15.70 కోట్లు వేతనాల రూపంలో చెల్లించారు. జిల్లాలో జరిగిన ఉపాధి పనుల్లో తాడేపల్లిగూడెం మండలం ప్రథమ స్థానంలో ఉంది. ఇంతవరకు ఈ మండలంలో కూలీలకు 63,480 పనిదినాలు కల్పించగా రూ.1.56 కోట్లు వేతనాలుగా పొందారు. నర్సాపురం మండలంలో 45,858 పనిదినాలు కల్పించగా రూ 1.10 కోట్లు వేతనాలుగా చెల్లించారు. మూడో స్థానంలో ఇరగవరం మండలం ఉంది. ఈ మండలంలో ఇంతవరకు 43,581 పనిదినాలు కల్పించగా రూ 1.04 కోట్లు వేతనాలకు ఖర్చు చేశారు. ఉపాధి పనులు చేస్తున్న సమయంలో గాయపడినా లేదా మృతిచెందినా... పనికి వెళ్తున్న సమయంలో లేదా వస్తున్న సమయంలో ప్రమాదం జరిగితే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకుంటుంది. గాయపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న సమయానికి రోజు కూలీలో 50 శాతం అంటే రూ.120 చెల్లిస్తుంది. పాక్షిక అంగవైకల్యం ఏర్పడితే రూ 25 వేలు, పూర్తి అంగవైకల్యం ఏర్పడితే రూ.50 వేలు, మృతిచెందితే బీమాతో సంబంధం లేకుండా రూ. 50 వేలు చెల్లిస్తారు.

రూ. 15.70 కోట్లు చెల్లించాం



జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు చేపట్టాం. జిల్లాలోని ప్రతీ మండలం, గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్నాయి. రోజుకు 45 వేల మంది పనులకు వస్తున్నారు. ఏప్రిల్ నుంచి ఇంతవరకూ వేతనాల రూపంలో రూ.15.70 కోట్లు చెల్లించాం.

– ఎస్‌టీవీ.రాజేశ్వరరావు, డ్వామా పీడీ

మండలాల వారీగా పనిదినాలు, వేతనాల ఖర్చు

మండలం	పనిదినాలు	వేతనాల ఖర్చు (రూ.లక్షల్లో)
తాడేపల్లిగూడెం	63,480	156.83
నర్సాపురం	45,858	110.25
ఇరగవరం	43,581	104.01
ఆచంట	37,403	90.67
ఆకివీడు	33,967	82.73
అత్తిలి	40,600	97.48
భీమవరం	36,350	89.34
కాళ్ల	33,328	82.83
మొగల్తూరు	37,937	85.98
పాలకొల్లు	30,242	71.18
పాలకోడేరు	26,314	65.04
పెంటపాడు	21,507	51.13
పెనుగొండ	22,945	52.33
పెనుమంట్ర	30,874	77.58
పోడూరు	31,647	76.56
తణుకు	25,750	59.06
ఉండి	38,218	95.59
వీరవాసరం	22,558	53.65
యలమంచిలి	27,524	68.04

జిల్లాలో జాబ్ కార్డులు 1.81 లక్షలు
ఉపాధి కూలీలు 3 లక్షల మంది
పనికి వెళ్తున్న వారు 1.23 లక్షల మంది

జగనన్నకు చెబుదాంతో సమస్యలకు పరిష్కారం



కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, జెడ్పీ చైర్మన్ కవురు, ఎమ్మెల్యే గ్రంధి, ప్రత్యేక అధికారి కన్నబాబు

భీమవరం (ప్రకాశంచౌక్): సంతృప్తి స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన సేవలు అందించేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలు తెలుసుకునేందుకు వీలు కల్పించడంతో పాటు వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించి సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమే ఈ వేదిక ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్న తపనతో మంచి కార్యక్రమానికి నాంది పలికామన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించ వచ్చన్నారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ప్రశాంతి, కలెక్టరు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి విపత్తుల నిర్వహణ శాఖ స్పెషల్ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి కె.కన్నబాబు , ఎస్పీ యు.రవి ప్రకాష్, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ రవికుమార్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



అకాల వర్షాల కారణంగా తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: అకాల వర్షాల కారణంగా ఏ ఒక్క రైతు నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులు అధైర్య పడవద్దని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తేతలి, కొండాయపాలెం, మండపాక, వేల్పూరు, యర్రాయి చెరువు, కొమరవరం గ్రామాల్లోని పొలాల్లో ధాన్యం రాసులను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. మండపాక గ్రామంలో కళ్లంలోని ధాన్యం తూకాలను పరిశీలించారు. వేల్పూరులో అకాల వర్షాల వల్ల తడిసిన వరి పంటను రైతులు మంత్రి కారుమూరికి చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యంతో పాటు కోసిన వరి పంట తడిసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాల్దరిలో రైతులపై కాల్పు జరిపించారని, అలాంటి నాయకుడు నేడు రైతులను చూసి మొసలి కన్నీరు కారుస్తున్నారని చెప్పారు. టీడీపీ, ఎల్లో మీడియా తాను అనని మాటను అన్నట్టుగా వైరల్ చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అధికారంలో వున్నప్పుడు ఎస్సీలలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అన్నారని, నాయీ బ్రాహ్మణులను తోకలు కట్ చేస్తానన్నారని, ఆ మాటలను రాష్ట్ర ప్రజలు ఎవరూ మర్చిపోలేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ శివరామ ప్రసాద్, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, వ్యవసాయాధికారి కె.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

సత్వర సేవలందించండి

తణుకు అర్బన్: రైతులకు అందాల్సిన ప్రతి ఉచిత సేవ సత్వరమే అందేలా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకులో మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రి కారుమూరి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యతను అధికారులు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ప్రతి రైతుకు గోనె సంచులు సకాలంలో సరఫరాల చేయాలని, రైస్ మిల్లర్ వద్దకు రైతు వెళ్లే పనిలేకుండా చూడాలని, రోడ్లపై ఉన్న ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి రైతుకూ భరోసా

- రూ.2 కోట్ల ఖర్చుతో గోనె సంచులు
- మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో అధికారులు, రైతులతో సమీక్షలో మాజీమంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతు పండించిన ప్రతి గింజను కొంటామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రకటించారు. గోనెల సంచుల సమస్యల ఉత్పన్నం కాకుండా రూ.2 కోట్లు సొంత వ్యయంతో 10 లక్షల గోనె సంచులు ఏర్పాటు చేస్తున్నట్లు మంగళవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో అధికారులు, రైతులతో అకాల వర్షాల వల్ల ఉత్పన్నమైన సమస్యలపై సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలు పడిన మే నెల మొదటి వారంలో కేవలం 30 నుంచి 40 శాతం వరకూ మాత్రమే కోతలు జరిగాయన్నారు. వారు వర్షాలతో ఇబ్బందులు పడ్డారన్నారు. ఇబ్బందులు తొలగించడానికి ఎప్పటికపుడు అధికారులు సత్వర చర్యలు తీసుకున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితిని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ భయాందోళనలుగా మార్చడానికి కుటిల యత్నాలు చేసారన్నారు. ఏనాడు వారు రైతులకు అండగా నిలవలేదని, కనీసం పైసా ఖర్చు చేయలేదన్నారు.గోనె సంచుల సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండడానికి వరంగల్, ఏలూరు ప్రాంతాల నుంచి రోజుకు 1.50 లక్షల గోనె సంచులు ఏర్పాటు చేశామన్నారు. వీటిని నియోజకవర్గంలో అవసరమైన రైతులకు అందిస్తామన్నారు. రైసు మిల్లర్ల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు రైతులు చెప్పగా.. రైసు మిల్లర్లు రైతులకు సహకరించాలన్నారు. ప్రభుత్వం నిబంధనల్లో నూక శాతంకు కోత విధించాలని ఎక్కడా లేదన్నారు. కేవలం రంగు మారిన ధాన్యంకు, తేమ శాతం ఉన్న ధాన్యంకు మాత్రమే కోత ఉంటుందన్నారు. అతిక్రమించి వ్యవహరిస్తే రైతులు సత్వరం తన దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగాలి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

నరసాపురం రూరల్: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం నరసాపురం మండలంలోని సీతారామపురం సౌత్ గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ రైస్ మిల్లులో ఒక ఈవోపీఆర్డీని నియమించామని, ప్రతీ ఆర్బీకే వద్ద వీఆర్వో, వీఏఏ, పంచాయతీ కార్యదర్శి, సీనియర్ ఇన్‌స్పెక్టర్, సహకారశాఖ సిబ్బంది ఇతర అధికారులను నియమించామని తెలిపారు. అవసరమైన గోనెసంచులు, హమాలీలు, వాహనాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్నామని, వాటిని పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ట్రక్‌షీట్ జనరేట్ అయ్యాక రైతులు మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కంట్రోల్‌రూం నెంబరు 8121676653కి ఫోన్ చేసి సమస్యలను తెలియజేస్తే తక్షణం పరిష్కరిస్తామన్నారు. రైతులకు ఇబ్బంది పెట్టే రైస్‌మిల్లర్లను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు.

కూలీ అనుమానాస్పద మృతి

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామపంచాయితీ పరిధిలోని రాజీవ్‌కాలనీకి చెందిన మిండాల అంతర్వేది నరసన్న(26) చెరువుకుంటలో పడి అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతిచెందారు. మృతుడి బంధువుల వివరాల ప్రకారం ఉదయం 6 గంటలకే ఇంటినుంచి బయటకు వెళ్లిన అంతర్వేది మధ్యాహ్నం వరకు రాలేదని మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో జుత్తిగ రోడ్డులోని చెరువుగుంటలో అంతర్వేది మృతదేహం ఉండటం స్థానిక రైతులు గుర్తించి సమాచారం అందించారని తెలిపారు. మృతుడికి తల్లి, చెల్లెలు, తమ్ముడు ఉన్నారని వారికి వివాహం అయిందని, అంతర్వేదికి వివాహం కాలేదని బంధువులు తెలిపారు. అంతర్వేది మృతి అనుమానాస్పదంగా ఉందని బంధువులు చెబుతున్నారు. పెనుమంట్ర పోలీసులను వివరణ కోరగా ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

నేడు పాలిసెట్



- ఏలూరు జిల్లాలో 8, పశ్చిమలో 19 కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 10,170 మంది విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 27 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఏలూరు జిల్లాలోని ఏలూరులో 8 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మొత్తం 19 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రవేశ పరీక్ష రాయడానికి ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి మొత్తం 10,170 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారు. వారిలో ఏలూరు జిల్లా నుంచి 3,708 మంది, పశ్చిమ గోదావరి నుంచి 6,462 మంది ఉన్నారు.

9 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి

పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమై ఒంటి గంట వరకూ జరుగుతుంది. విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. విద్యార్థులను ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు తమతో పాటు పరీక్షా కేంద్రంలోకి హాల్ టిక్కెట్, బ్లాక్/బ్లూ బాల్‌పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరైజర్ మాత్రమే తీసుకెళ్లాలి. కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పాలిసెట్‌లో ర్యాంకులు సాధించి వివిధ పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థుల్లో అర్హులైన వారికి ఫీజు చెల్లించాల్సిన అవసరమే ఉండదు. ఆ విద్యార్థులకు మూడు సంవత్సరాల పాటు జగనన్న విద్యా దీవెన పథకం కింద ఫీజు రీఎంబర్స్‌మెంట్ లభిస్తుంది. దీనితో పాటు జగనన్న వసతి దీవెనకు సైతం అర్హులవుతారు. పాలిటెక్నిక్ డిప్లమో పూర్తి చేసిన విద్యార్థులు ఈ-సెట్ ప్రవేశ పరీక్షా రాయడం ద్వారా బీటెక్ కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరం చదవడానికి అర్హత సాధిస్తారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు



పరీక్ష ప్రారంభమయ్యే సమయం ఉదయం 11 గంటలు దాటి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. ఏలూరు నగరంలో పాలిసెట్ రాయడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఏలూరు కొత్త బస్టాండులో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాల గురించి తెలుసుకోవడానికి ఈ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదించవచ్చు.

– అక్కినేని శివకుమార్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్, ఏలూరు జిల్లా పాలిసెట్

సిబ్బందికి పూర్తయిన శిక్షణ

పరీక్షల నిర్వహణకు సంబంధించి నియమితులైన అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక పరిశీలకుడు, ప్రతి 24 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున నియమించారు. రెవెన్యూ, పోలీస్, విద్యా శాఖలకు చెందిన ఉద్యోగులతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో గాలీ వెలుతురు సౌకర్యంతో పాటు విద్యార్థులకు తాగు నీటి సౌకర్యాన్ని అందుబాటులో ఉంచారు.

పరీక్షా కేంద్రాలివే..

ఏలూరు జిల్లాలో...
- సీఆర్ఆర్ అటానమస్ కళాశాల
- సీఆర్ఆర్ జూనియర్ కళాశాల
- సీఆర్ఆర్ మహిళా కళాశాల
- సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల బ్లాక్ -ఏ, బ్లాక్ – బీ, బ్లాక్ – సీ
- సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల బ్లాక్-ఏ, బ్లాక్-బీ పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో...
- భీమవరంలో ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్
- పీఎస్ఎం బాలికోన్నత పాఠశాల
- లూథరన్ ఎయిడెడ్ హైస్కూల్
- విష్ణు స్కూల్
- సీత పాలిటెక్నిక్ కళాశాల
- బీవీ రాజు డిగ్రీ కళాశాల
- తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- ఎస్‌సీఐఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల
- ఎస్‌కేఎస్‌డీ మహిళా డిగ్రీ కళాశాల
- మాంటిస్సోరి స్కూల్
- జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ఏ, బీ సెంటర్లు
- శశి హైస్కూల్
- ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాల
- తాడేపల్లిగూడెంలో శశి ఇంజనీరింగ్ కళాశాల
- నరసాపురంలో వైఎస్ డైమండ్ జూబ్లీ జూనియర్ కళాశాల
- జీవీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, వైఎస్ డిగ్రీ కళాశాల

రైతులు ఆందోళన చెందొద్దు



పెనుగొండలో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టరు రామ్ సుందర్ రెడ్డి

పెనుగొండ: ఎప్పటికప్పుడు కోసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశామని, రైతులు ఆందోళన చెందవద్దని జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పెనుగొండ అడ్డపుంతలో కోతలు కోస్తున్న ధాన్యాన్ని, ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఆర్‌బీకేలో ధాన్యం అప్పగించి రసీదు పొందే వరకూ మాత్రమే రైతు బాధ్యతన్నారు. రైసు మిల్లర్లు పిలిచినా వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అకాల వర్షంతో రైతుల వద్ద ఉన్న ధాన్యం ఒక్క గింజ మిగలకుండా కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

పాలకొల్లు అర్బన్: ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు అపోహలు పెట్టుకోవద్దని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అన్నారు. పూలపల్లిలో శ్రీ జయలక్ష్మి వెంకట నరసింహ రైస్‌మిల్లును మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం మిల్లర్ల దగ్గరకు వచ్చిన వాహనాలను పరిశీలించారు. రైతుల నుంచి ఏమైనా డబ్బులు వసూళ్లు చేస్తున్నారా అని ఆరా తీశారు.

30 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ స్వాధీనం

పెనుగొండ: చెరుకువాడలో సిద్ధాంతం వద్ద లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున అందిన సమాచారంతో రెవెన్యూ అధికారులు, విజిలెన్స్ సీఐ పులపర్తి శివరామకృష్ణ, సిబ్బంది చెరుకువాడలో సిద్ధాంతం రోడ్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో పీడీఎస్ బియ్యంతో లారీ పట్టుబడిందన్నారు. పోడూరు మండలం కవిటం నుంచి తూర్పుగోదావరి జిల్లా నర్సిపూడి ఆలమూరుకు బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తేలిందన్నారు. ఈ లారీలో 30 క్వింటాళ్ల పీడీఎస్ రైస్, లారీ స్వాధీనం చేసుకుని, చింతపల్లి రమేష్, లిగాల గోవిందు, ఉండమట్ల మణికంఠ, చిక్కిరెడ్డి రాజులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బ్లాక్ లిస్టులోకి పద్మజ రైస్‌మిల్లు

ఆకివీడు: రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ ధాన్యం దిగుమతులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న దుంపగడపలోని పద్మజ సూపర్ ఫుడ్స్ రైస్‌మిల్లును జిల్లా అధికారులు బ్లాక్ లిస్టులో చేర్చారు. గత కొన్ని రోజులుగా రబీ ధాన్యం దిగుమతుల్లో రైతుల నుంచి అదనంగా సొమ్ము వసూలు చేస్తున్నారని తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావుకు ఫిర్యాదులు అందడంతో మిల్లుపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదించారు. ఈ మేరకు ఆన్‌లైన్ ఈ-మార్కెట్ నుంచి రైస్‌మిల్లు పేరును తొలగించడంతో గత రెండు రోజులుగా మిల్లుకు ధాన్యం చేరడంలేదు. మిల్లుకు కేటాయింపులు జరగడం లేదు. రైతుల ఫిర్యాదుల మేరకు పద్మజ రైస్‌మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టినట్లు తహసీల్దార్ వెంకటేశ్వరరావు విలేకర్లకు వివరించారు.

రొయ్యల వ్యాన్ చోరీపై ఎస్పీ విచారణ

ఆకివీడు: కాళ్ల మండలం పెదమిరం గ్రామంలో ఇటీవల జరిగిన రొయ్యల వ్యాన్, రొయ్యల దొంగతనంపై జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ మంగళవారం ఆకివీడు పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేశారు. ఈ చోరీకి సంబంధించి భద్రాచలం, జీలుగుమిల్లి, మొగల్తూరు ప్రాంతాలకు చెందిన వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో క్రైమ్ సీఐ ఆకుల రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ వంకా



తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ కుటుంబ సభ్యులు

తణుకు టౌన్: ఇటీవల ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలుపొందిన రాష్ట్ర ఎంఎస్ఎంఈ చైర్మన్ వంక రవీంద్రనాథ్ మంగళవారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేసినట్లు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తలపెట్టిన సంక్షేమ యాగం విజయవంతం కావాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

యోగాతోనే మానసిక ఉల్లాసం



గూడెం కడకట్లలో విద్యార్థులకు, యువతకు ఉచిత యోగా శిక్షణ అందిస్తున్న శిక్షకురాలు జి. రూప

పెంటపాడు: యోగా అభ్యసన ద్వారా మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని ప్రముఖ యోగా, ధ్యాన శిక్షకురాలు జి. రూప పేర్కొన్నారు. గూడెం కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో విద్యార్థులకు గత వారం రోజుల నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులలో భాగంగా యోగా సాధన గత కొద్దిరోజులుగా జరుగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.తబిత, మాథ్స్ ఉపాధ్యాయులు టి. శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు పోరుబాట

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ఈ నెల 10, 11, 12వ తేదిల్లో పోరాటం చేపట్టనున్నట్టు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని దండగర్ర గ్రామంలో ఉపాధి హామీ పని ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ కూలీలు ఎవరికీ రూ.272లు మించి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల సమస్యలపై ఈ నెల 12వ తేదిన భీమవరంలో జరగనున్న ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గట్టిం శాంతకుమారి, ఎస్.వలీ, సత్యలక్ష్మి, దుర్గ, మైనం కోటమ్మ, గోవర్ధన్, కొనకండ్ల వరలక్ష్మి, మైనం సత్యవాణి, మైనం కనకదుర్గ పాల్గొన్నారు.

వడివడిగా ధాన్యం సేకరణ

- నిబంధనలు సడలింపుతో ఊపిరి పీల్చుకున్న రైతులు
- స్థానిక మిల్లులకు ధాన్యం సరఫరా



మండపాకలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్, వ్యవసాయాధికారులు

తణుకు టౌన్: అకాల వర్షాల వల్ల ఆందోళన చెందుతున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రోడ్లపై, కళ్లాలో ఆరబెట్టిన ధాన్యాన్ని వారి సంచుల్లో నింపి మిల్లులకు తరలిస్తున్నారు. మరో సారి వర్షం వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యానికి, రైతులకు నష్టం లేకుండా చర్యలు చేపట్టారు. అందులో బాగంగా మంగళవారం రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మండలంలోని దువ్వ, తేతలి, మండపాక, వేల్పూరు, యర్రాయి చెరువు, కొమరవరం గ్రామాల్లోని రైతుల పొలాల వద్దకు వెళ్లి ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టి వాటిని బస్తాలుగా మార్చి రైస్ మిల్లుకు తరలించేలా రైతులను అప్రమత్తం చేశారు. జిల్లా, మండల స్థాయిలోని సివిల్ సప్లయ్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది కళ్లాల్లోని ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి వాటిని బస్తాలుగా పట్టించి, ట్రాక్టర్లు, లారీల్లో ఎగుమతి చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ టీ శివరామ్‌ప్రసాద్, మండల వ్యవసాయాధికారి కె కుసుమ, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై హర్షం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న యువనేత కొట్టు విశాల్ తదితరులు

పెంటపాడు: తాడేపల్లిగూడెం నూతనంగా రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సంబరాలు చేశారు. టపాసులు కాల్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. సీఎం జగనన్నకు, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెంటపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో యువనేత కొట్టు విశాల్ హాజరై సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో విశాల్ మాట్లాడారు. నూతనంగా ఏర్పాటైన రెవిన్యూ డివిజన్ ద్వారా ప్రజలకు ఎంతో సౌలభ్యం ఉంటుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు భాస్కరరెడ్డి, కర్రి పృథ్వీకుమార్‌రెడ్డి, వెలగల శ్రీనివాస రెడ్డి, పంచాయతీ బోర్డు సభ్యులు రెడ్డి శ్రీనివాస్, బర్ల జయరాంబాబు, వెలంపేట యూత్, రెడ్డి యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు. విప్పర్రు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సంపతరావు కృష్ణారావు, పసల చంటి పాల్గొన్నారు. రావిపాడు గ్రామంలో రెవిన్యూ డివిజన్ ఏర్పాటైన సందర్భంగా మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణలు మాట్లాడుతూ సీఎం జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రావిపాడు ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, కైగాల గణపతి, తదితరులు పాల్గొన్నారు.

మారంపల్లిలో సీఎం జగన్‌కు క్షీరాభిషేకం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మారంపల్లి గ్రామంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. తాడేపల్లిగూడెంకు రెవె న్యూ, పోలీస్ సబ్ డివిజన్‌లు ఏర్పాటుచేస్తూ ఉత్తర్వు లు జారీచేయడం పట్ల గ్రామ ఉపసర్పంచ్ సరిపల్లి చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణంరాజు, సొసైటీ మాజీ డైరెక్టర్ కల్లేపల్లి లక్ష్మీపతిరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మారంపల్లి గ్రామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రూత్ మెర్సీ సేవలు మరువలేనివి



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న దాతలు

పెంటపాడు: సంఘసేవకురాలిగా, గురువుగా మానుకొండ రూత్ మెర్సీ చేసిన సేవలు మరువలేనివని గూడెం టౌన్ ఎ. క్లాస్ ప్యారిష్ లూథరన్ చర్చి సంఘ గురుమండల అధ్యక్షుడు కె. విజయరాజు పేర్కొన్నారు. కొండాయి చెర్వు టీచర్స్ కాలనీలో జీసెస్ బిలీవర్స్ యూనియన్ (జెబీయు) మెర్సీ సోల్జర్స్ ఆధ్వర్యంలో రూత్‌మెర్సీ 13వ వర్ధంతి సేవా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె సేవలను పలువురు కొనియాడారు. జేబీయు అధ్యక్షుడు మానుకొండ డల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధులకు, వికలాంగులకు, నిరాశ్రయులకు, కుష్టురోగులకు అన్న, వస్త్రదానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు, గూడెం పాస్టర్‌లు సిహెచ్ ఇశ్రాయేలు, బాలేరాజు, బిషప్, క్రైస్తవ కళాశాల ప్రిన్సిపాల్ దొడ్డిగర్ల ప్రకాష్, నక్కా విద్యాసాగర్, చిన్నం డేనియల్‌రాజు, పి. సునీల్‌కుమార్, మెండెం జేమ్స్, చోళ జగదీష్, తిర్రే దేవదాసు, పాస్టర్ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు మానుకొండ భాస్కరరావు, జ్యోతి హరిశ్చంద్ర ప్రసాద్, పలు సంఘాల క్రైస్తవ నాయకులు , సేవకులు తదితరులు పాల్గొన్నారు.

నీటి మళ్లింపు



గోదావరి ఏలూరు కాలువ నుంచి నీటిని వదులుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: అకాల వర్షాల కారణంగా కాలువులు నిండుకుండలా కనిస్తున్నాయి. కాలువలు కట్టేసినందు వల్ల పంపుల చెరువుకు గోదావరి ఏలూరు కాలువకు శివాలయం సమీపంలో వేసిన అడ్డుకట్ట నుంచి పంపుల చెర్వుకు ఎగువ నుంచి వచ్చే నీటిని రా వాటర్ పంపింగ్‌కు తరలిస్తున్నారు. ఇటీవల కురిసిన వానల కారణంగా పొలాల్లోని మురికి నీరు వచ్చి కాలువలో ఉన్న నీళ్లలో చేరడంతో, మురికినీరు చేరిన నీటిని దిగువకు మళ్లిస్తున్నారు. ఎగువ నుంచి కొద్దిగా వస్తున్న మంచినీటిని పంపింగ్ కోసం మళ్లిస్తున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసచైతన్య, ఎంఈ మురళీకృష్ణలు పర్యవేక్షించారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: మండలంలోని ప్రజలు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొట్టు విశాల్ పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యువనేత కొట్టు విశాల్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన 1902 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ నెంబర్ ప్రజలకు జవాబుదారీగా ఉంటుందన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వీక్షించారు. ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి రామారావు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, బర్ల జయరాంబాబు, యూత్ అధ్యక్షులు కొవ్వూరి భాస్కరరెడ్డి, కర్రి పృథ్వీ రెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

సాక్షి, భీమవరం : భీమవరం పట్టణం ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రెహమాన్ మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి ఉన్నారు.

మందకృష్ణ బీజేపీతో చేతులు కలపడం శోచనీయం



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కర్ణాటకలో జరగుతున్న ఎన్నికల్లో మందకృష్ణ మతతత్వ బీజేపీ పార్టీ తరుపున ప్రచారం చేయడం ఎంత వరకు సబబు అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ప్రశ్నించారు. పట్టణంలోని వీకర్స్‌కాలనీలో మంగళవారం మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో మందకృష్ణ నోటాకు ఓటు వేయమంటే రాష్ట్రంలో ఉన్న మాలలందరు వైఎస్సార్ సీపీకే ఓటు వేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి కృషి చేసినట్లు తెలిపారు. మతతత్వ పార్టీ బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సైతం బీజేపీ పార్టీతో పాటుగా భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ శ్రేణులు ఎస్సీలపైన, దళితుల పైన దాడులు చేస్తుంటే మందకృష్ణ మాత్రం తన స్వార్ధ ప్రయోజనాల కోసం బీజేపీతో చేతులు కలపడం శోచనీయం అన్నారు. రాష్ట్రంలో మాదిగ సోదరులు ఎవ్వరూ మందకృష్ణ మాట వినవద్దని విజ్ఞప్తి చేశారు. మాల, మదిగలు ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమన్నారు. ఈ సమావేశంలో అనురాజ్, బాలకృష్ణ, రామచంద్రం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కె.ప్రకాశ్‌బాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం సాయంత్రం కోర్టు పరిధిలోని అన్ని మండలాల సీఐలు, ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ లోక్ అదాలత్ ఈ నెల 13న నిర్వహిస్తున్నందున ఎక్కువ మంది కక్షిదారులకు రాజీ పడదగిన కేసుల్లో పరిష్కారం చేసేందుకు కృషి చేద్దామన్నారు. ఎక్కువ కేసులను రాజీ చేసేందుకు పోలీస్, రెవెన్యూ, పుర పాలక సంఘం, ఇతర స్థాయిల అధికారులు చూడాలని ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణ్‌శ్రీ, రెండోవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి అన్నామణిలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి



పెన్షనర్స్ సమావేశంలో మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పింఛన్‌దారుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా పింఛనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని స్టేట్ గవర్నమెంట్ పింఛనర్స్ అసోసియేషన్ హాలులో కార్యవర్గ సమావేశంలో హరికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ నవీకరణ చేయించుకొనేందుకు కాలపరిమితిని ఎత్తివేయాలన్నారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరారావు, అర్జునరావు, గరికపాటి సుబ్రహ్మణ్యశర్మ, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవర్చుకోవాలి



అత్తిలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు

అత్తిలి: విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృధా చేయకుండా జ్ఞాన సముపార్జనకై గ్రంథాలయాలకు వెళ్లి అమూల్యమైన పుస్తక సంపదను పఠనం చేసుకోవాలని వలంటీర్ ఎ బాలాజీ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం, నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి, గ్రంథాలయానికి వచ్చి విలువైన పుస్తక సంపదను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి లక్ష్మణరావు, ఎం శ్రీదేవి, పి వెంకటేశ్వరరావు, కె దానేశ్వరరావు, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. తెలుగు పాఠ్యాంశాలు, హిందీ, ఇంగ్లీషు, లెక్కలు, పజిల్స్, సోషల్ స్టడీస్, ఆట పాటలు, దేశభక్తి, ప్రభోదాత్మక గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు మహాశివభట్టు లక్ష్మణరావు, ఎ.జనార్ధనరావు, ప్రత్తి వీరాస్వామి, ఎస్.సాల్మన్‌రాజు, నున్న సత్యం. మంగరాజులు విద్యార్థులకు వివిధ అంశాల్లో అవగాహన చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

వీరవాసరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గొలగాని సత్యనారాయణ డిమాండ్ చేశారు. కారుమూరి ఒక మంత్రి హోదాలో ప్రజలకు సేవ చేస్తుండగా కావాలనే దురుద్దేశంతో టీవీ5 యాంకర్ మూర్తి, టీడీపీ నాయకుడు పట్టాభి నోటికి వచ్చినట్లు దుర్భాషలాటం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వీరవాసరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పాలకొల్లు యాదవ సంఘం మండల అధ్యక్షుడు భోగేశ్వరరావు, పెర్కిపాలెం సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గుండుబోయిన శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు